క్లుప్తంగా

ధాన్యం కొనుగోలుకు ప్రత్యేక చర్యలు



గొల్లప్రోలు మిల్లులో ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో ధాన్యం కొనుగోళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన సోమవారం గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. భారీ వర్షాలకు ధాన్యం తడిసి పోకుండా త్వరత గతిన మిల్లులకు చేరేలా చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు ఎక్కడా ధాన్యం తడిసిన సంఘటనలు లేవని తెలిపారు. గొల్లప్రోలు మండలంలో 15 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని రెండు రోజుల్లో సేకరించామన్నారు. ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా ధాన్యం సేకరిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు నాలుగు టీంలు ఏర్పాటు చేశామన్నారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ధాన్యం సేకరిస్తున్నట్టు తెలిపారు.

రైళ్ల రద్దుతో హెల్ప్ లైన్ ఏర్పాటు



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో హెల్ప్‌లైన్

సామర్లకోట: తుపాను కారణంగా పలు రైళ్లను దక్షిణ మధ్య రైల్వే రద్దు చేసింది. దీనిని దృష్టిలో ఉంచుకొని రైల్వే ప్రయాణికులకు పూర్తి సమాచారం ఇవ్వడానికి స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటికే రిజర్వేషన్లు చేయించుకున్న వారు పూర్తి మొత్తం రైల్వే నుంచి పొందే ఏర్పాట్లు చేసినట్టు రైల్వే మేనేజరు ఎం.రమేష్ తెలిపారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌లో 08884- 2327010 నంబరుతోను, కాకినాడలో 08884-2374227తోను హెల్ప్ లైన్లు పని చేస్తాయని ప్రయాణికులు ఆయా నంబర్లకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవచ్చని చెప్పారు.

మరిడమ్మకు పూజలు



పూజలందుకుంటున్న మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి సోమవారం మఖ నక్షత్ర పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహన రావు, ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, బంగారు. వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాకినాడ వెళ్లి పింఛను అందజేత



భాస్కరరావుకు పింఛను అందజేసిన వలంటీర్

సామర్లకోట: గ్రామంలోని ఏడో సచివాలయం పరిధిలోని వృద్ధుడు కోడులూరి భాస్కరరావు అనారోగ్యం కారణంగా కాకినాడలోని తన కుమార్తె ఉంటి వద్ద ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ నాగలక్ష్మి సోమవారం అక్కడకు వెళ్లి పింఛను అందజేసింది. మూడు నెలల పాటు పింఛను వరుసగా తీసుకోకపోతే రద్దు అయ్యే అవకాశం ఉందని, ఎట్టిపరిస్థితుల్లోనైనా లబ్ధిదారులు తీసుకోవాలని సూచించారు.

ముస్లిం మైనార్టీ కన్వీనర్ ఉభయదుల్లా మృతి



మహ్మద్ ఉభయదుల్లా (ఫైల్)

సామర్లకోట: వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ కన్వీనర్, మాజీ మున్సిపల్ ముస్లిం మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ ఉభయదుల్లా(72) సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉన్న ఆయన మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం పని చేశారు. ఉభయదుల్లా మృతిపై రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్‌చైర్మన్ ఉబాజాన్ మోజెస్, అధికార పార్టీ కౌన్సిలర్లు సంతాపం తెలిపారు. పార్టీ ప్రతి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనే ఉభయదుల్లా మృతి పార్టీకి తీరని లోటు అని దొరబాబు సంతాపం తెలిపారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన ఉభయదుల్లా అంతిమ యాత్రలో దొరబాబు పాల్గొన్నారు.



కళ్లాల్లో ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచిస్తున్న గొల్లప్రోలు ఏఓ సత్యనారాయణ



సేకరించిన ధాన్యాన్ని లాటు వేయిస్తున్న సిబ్బంది



సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు చేరుస్తున్న రైతు భరోసా కేంద్రం సిబ్బంది

అంతా అప్రమత్తం

- అన్నదాతకు భరోసా ఇస్తున్న వ్యవసాయ శాఖ
- ధాన్యాన్ని మిల్లులకు చేరుస్తున్న వాహనాలు
- సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటున్న అధికారులు

పిఠాపురం: వ్యవసాయం గాలిలో దీపం లాంటిది. ఎప్పుడు, ఏ కష్టం వచ్చిపడుతుందో తెలీదు. పంట ఇంటికి చేరితేనే ఆ ఏడాది రైతుకు పంట పండినట్టు. ఇక ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే నష్టాలు తప్పవు. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ శాఖలో తీసుకొచ్చిన సమూల మార్పులు, సంస్కరణలు ఇప్పుడు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఎంతటి విపత్తు నుంచైనా పంటలు రక్షించుకునే ధైర్యాన్ని, భరోసాను రైతన్నకు కల్పిస్తున్నాయి. నష్టపోయాక పరిహారం ఇవ్వడం కంటే, అసలు నష్టాలే లేకుండా చేయాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ శాఖ ద్వారా తీసుకువచ్చిన సంస్కరణలు సంపూర్ణ ఫలితాలను ఇస్తున్నాయి.

రైతుకు అండగా..

పండిన పంటను క్షేమంగా రైతు ఇంటికి చేర్చడంలో వ్యవసాయ శాఖ, ఆర్బీకే సిబ్బంది పోషిస్తున్న పాత్ర అందరి మన్ననలు పొందుతోంది. దుక్కి దున్నినప్పటి నుంచి పంటలు దరికి చేర్చేవరకు వీరు చేస్తున్న కృషి, రైతులకు ఇస్తున్న భరోసా అన్నదాతలకు కొండంత ధైర్యాన్నిస్తోంది. పంటలు కాపాడుకునే పద్ధతులు వారికి తెలిసినప్పటికీ, అవకాశాలు కుదరక తీవ్ర నష్టాల పాలైన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి, అన్నదాతకు అండగా నిలుస్తున్నారు.

సిబ్బంది బిజీ

తుపాను ప్రభావంతో రెండు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేస్తూ, ఖరీఫ్ సీజన్‌లో కోత కోసిన పంటలను దరికి చేర్చడంలో వ్యవసాయ శాఖ, ఆర్బీకే సిబ్బంది విశేష కృషి చేస్తున్నారు. ఇప్పటికే కోతలు పూర్తయి, కళ్లాల్లో ఉన్న ధాన్యం రక్షణకు ఏ చర్యలు తీసుకున్నారో పరిశీలిస్తున్నారు. ధాన్యానికి వంద శాతం రక్షణ కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రం ద్వారా సిబ్బంది కొనుగోలు చేసి, వాటిని భద్రంగా మిల్లులకు చేర్చే పనిలో బీజీగా మారారు. ఇంకా కోతలు పూర్తికాని, పొలాల్లో కోతలను నిలిపివేసిన అధికారులు.. పంట దెబ్బతినకుండా వర్షాల నుంచి రక్షణకు ఏం చేయాలో రైతులను అప్రమత్తం చేస్తున్నారు.



వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మిల్లులకు సురక్షితంగా చేరిన ధాన్యం వాహనాలు

అధికారుల అప్రమత్తం

సామర్లకోట: తుపాను నేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. రైతులు పంటను నష్టపోకుండా చర్యలు తీసుకొంటున్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసి కళ్లాల్లోనూ, రోడ్డు మార్జిన్లలో ఉన్న ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. మండల పరిధిలో చంద్రంపాలెం, నవర, గొంచాల, అచ్చంపేట, ఉండూరు, వి.కె.రాయపురం, మాధవపట్నం గ్రామాల్లో రైతుల పొలాలను కాకినాడ ఆర్డీఓ ఇట్ల కిషోర్, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, వ్యవసాయశాఖ ఏడీఏ జీవీ పద్మశ్రీ, ఏఓ ఐ.సత్య సందర్శించారు. మిచాంగ్ తుపాను ఉధృతి పెరిగితే మండల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. దాంతో రాశులుగా పోసి ప్లాస్టిక్ కవర్లు ధాన్యం కప్పినా అడుగున ఉండే ధాన్యం పొర తడిచి పాయే అవకాశం ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని మిల్లులకు ధాన్యం తరలిస్తున్నామని చెప్పారు. రైతులకు గోనె సంచులు, హమాలిస్‌ను ఏర్పాటు చేశామని ఆర్డీఓ తెలిపారు. ఈ మేరకు జాయింట్ కలెక్టరు ఇలాక్కియ రైతులు తీసుకొని వచ్చిన ధాన్యం పూర్తి స్థాయిలో తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారని ఏఓ సత్య తెలిపారు. వి.కె.రాయపురంలో ఆలస్యంగా వరి నాట్లు ప్రారంభం కావడంతో కోతలు పూర్తి కాలేదన్నారు. కొంత మంది రైతులకు వరి కోత యంత్రాలు అందుబాటులో లేకపోవడం వలన కోతలు పూర్తి చేసుకోకపోవడంతో గాలులకు పంట పొలాలు నేలకొరిగి పోయాయి. భారీ వర్షాలు కురిస్తే ఈ పంటకు నష్టం జరిగే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు చెప్పుతున్నారు. ధాన్యం రాశులలో మొలకలు రాకుండా రైతులకు సూచనలు ఇస్తున్నారు. మండల పరిధిలో నాలుగు వేల ఎకరాలల్లో వరి కోతలు చేయవలసి ఉండగా, కోతలు కోసి రాశులుగా నాలుగు వేల టన్నుల ధాన్యం ఆరబెట్టడానికి సిద్ధంగా ఉన్నదని చెప్పారు. వర్షం తెరుపు ఇచ్చిన వెంటనే ఆ ధాన్యం రాశులను మిల్లులకు తరలిస్తామని ఏఓ తెలిపారు.

ధాన్యం దెబ్బతినకుండా చూస్తున్నాం

పిఠాపురం నియోజకవర్గ పరిధిలో పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ఏలేరు, పీబీసీ ఆయకట్టు కింద సుమారు 42 వేల ఎకరాల్లో ఖరీఫ్ పంట సాగు చేశారు. ఇప్పటికే 38 వేల ఎకరాల వరకు పంట కోతలు పూర్తయ్యాయి. వీటిలో 40 శాతం ధాన్యం ఇప్పటికే కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు చేరుకోగా, మిగిలిన ధాన్యాన్ని వర్షాల్లో దెబ్బతినకుండా తగిన రక్షణ చర్యలు తీసుకునేలా రైతులను అప్రమత్తం చేశాం. ఇంకా తేమగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేలా అన్ని చర్యలు తీసుకున్నాం. వ్యవసాయ శాఖ మండల అధికారులతో సమీక్షిస్తూ, ఆర్బీకే సిబ్బందిని క్షేత్ర స్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవడంతో, రైతులు ఎటువంటి నష్టాలు లేకుండా తమ పంటను సురక్షితంగా దరికి చేర్చుకుంటున్నారు.

– పి.స్వాతి, ఏడీఏ, వ్యవసాయ శాఖ, పిఠాపురం

బీచ్ రోడ్డును పరిశీలించిన కలెక్టర్

అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం



ఉప్పాడలో పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కొత్తపల్లి: మిచాంగ్ తుపాను కారణంగా తీరప్రాంతంలో ఉన్న అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. మండలంలోని ఉప్పాడలో కోతకు గురవుతున్న తీరప్రాంతం, మత్స్యకార గృహాలను, ఉప్పాడ-కాకినాడ బీచ్ రోడ్డును సోమవారం ఆమె పరిశీలించారు. ముందు జాగ్రత్త చర్యలపై స్థానిక అధికారులను ఆదేశించారు. సూరాడపేట ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారికి భోజనం వడ్డించారు. వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ మరో రెండు రోజుల పాటు తుపాను ప్రభావం ఉండవచ్చన్నారు. దీని కారణంగా జిల్లాలోని తీరప్రాంత గ్రామాల్లో అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్టు చెప్పారు. తీరానికి సమీపంలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తామన్నారు. వారికి కావాల్సిన భోజనం, తాగునీరు, అల్పాహారం కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. చిన్నారులకు పాలు, గుడ్లు అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించామన్నారు. ముఖ్యంగా తుపానుకు సంబంధించి నష్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. కూలిన, దెబ్బతిన్న గృహాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. వర్షం కారణంగా రైతులు తమ పంటను నష్టపోకుండా, ముందుగానే రైతులను అధికారుల ద్వారా హెచ్చరించినట్టు చెప్పారు. మిగిలిన రైతులు తమ పంటను కాపాడుకోవడానికి తుపాను అనంతరం కోతలు పెట్టుకోవాలన్నారు. అధికారులు బీచ్ రోడ్డును పునరుద్ధరించే వరకూ ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీఓ వెంకటనారాయణ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ప్లాస్టిక్ కవర్లు కప్పిన ధాన్యం రాశులు

ప్రజా సమస్యల పరిష్కారానికి స్పందన

- పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు
- స్పందనకు 10 అర్జీలు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. ప్రతివారం నిర్వహించే స్పందనలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి ఈ సోమవారం ఆరు అర్జీలు అందినట్టు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ స్పందనలో వచ్చే ప్రతి అర్జీ సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. అర్జీలను ఆయా శాఖ అధికారులకు పంపించామన్నారు. పట్టణ పరిధిలోని పరిశ్రమల వల్ల వచ్చే కాలుష్య నివారించాలని, భూమి రీ సర్వే చేయాలని, ఆక్రమణకు గురైన స్థలాలను కాపాడాలని, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్లు మారాయని తదితర సమస్యలపై ఫిర్యాదులు అందాయన్నారు. పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డీటీ భానుకుమార్‌లున్నారు.



స్పందనలో అర్జీ స్వీకరిస్తున్న పెద్దాపురం ఆర్డీఓ

పునరావాస కేంద్రాలకు తరలిరండి

కొత్తపల్లి: తీరప్రాంత ప్రజల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలిరావాలని తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్ అన్నారు. ఉప్పాడ తీరప్రాంతంలో ఏర్పాటు చేసిన రెండు పునరావాస కేంద్రాలను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. కోతకు గురవుతున్న తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. సుమారు 500 మందికి భోజన వసతి కల్పిస్తున్నామన్నారు.



పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న తహసీల్దార్ ప్రసాద్, కన్వీనర్ ఉమ్మిడి జాన్

పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికి మండల సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, వైఎస్సార్ సీపీ నాయకులు వసతులు కల్పిస్తున్నారని తెలిపారు.

ధాన్యం రవాణాకు కాజ్‌వే సిద్ధం



వీకే రాయపురం ఏలేరు కాలువలో సిద్ధమైన కాజ్‌వే

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: వీకే రాయపురం ఏలేరు కాలువలో రైతులు కాజ్‌వేను ధాన్యం రవాణాకు సిద్ధం చేసుకున్నారు. భారీ వర్షాలు కారణంగా కాజ్‌వే కోతకు గురి అయింది. దాంతో సాక్షి దినపత్రికలో 'ధాన్యం రవాణా ఎలా' అనే శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో కలెక్టరు రూ.1.43 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులకు రైతులు కొంత మొత్తం జమ చేసుకొని తూరలు ఏర్పాటు చేసి గ్రావెల్‌తో నింపారు. ఏలేరు కాలువ అవలి వైపు రైతులకు చెందిన పంట భూములు ఉండడంతో వాహనాలు రాకపోకలు జరిగేలా సుమారు 35 ఏళ్ల క్రితం కాజ్‌వేను ఏర్పాటు చేశారు. ఏలేరు ఉధృతికి ఈ కాజ్‌వే తరచూ శిథిలావస్థకు గురయ్యేది. ప్రస్తుతం రైతుల పంటలు రవాణాకు కాజ్‌వే సిద్ధమైంది. అయితే వర్షాల కారణంగా రైతులు కోతలు నిలిపివేశారు. ఈ వర్షాలకు ఏలేరు ఉధృతి పెరిగితే మళ్లీ కాజవే కొట్టుకుపోతుందని రైతులు వెలమర్తి బుల్లి రాజు, గొల్లపల్లి శ్రీనివాసరావు, ఇంటి వెంకట్రావు, వెలమర్తి శ్రీనివాసు, తలారి దొరబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అరున క్యాంపస్ ఇంటర్వ్యూలు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ కళాశాలలో డిసెంబర్ అరున హెటిరో డ్రగ్స్ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారని కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ బీఈవీఎల్ నాయుడు సోమవారం తెలిపారు. 2023లో ఆర్గానిక్ లేదా ఎనలటికల్ కెమిస్ట్రీ డిగ్రీ లేదా పీజీలో పూర్తిచేసి 27 ఏళ్లలోపు అభ్యర్థులు హాజరు కావచ్చని తెలిపారు.

ఎడతెరిపి లేకుండా భారీ వర్షం

కొత్తపల్లి: మిచాంగ్ తుపాను ప్రజలను హడలెత్తిస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షంతో మండలంలో జనజీవనం స్తంభించింది. రైతులు చేతికందిన పంటను రక్షించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేసుకుంటున్నారు. వరికుప్పలపై, ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని పర్యటించి, కళ్లాల్లోని ధాన్యపు రాశులను పరిశీలించి, రైతులకు సూచనలు ఇచ్చారు.

సుమారు 19 హెక్టార్ల వరి పంట నేలనంటిందని వ్యవసాయాధికారి జోగిరాజు తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా పంటను రైతులు ఒబ్బిడి చేశారన్నారు.



కొత్తపల్లిలో కురుస్తున్న వర్షం

కుక్కుటేశ్వరా.. నమోస్తుతే..

- వర్షాన్ని లెక్క చేయని భక్తులు
- కిటకిటలాడిన శివాలయాలు

పిఠాపురం: కార్తికమాసం మూడో సోమవారం సందర్భంగా స్థానిక పాదగయ పుణ్యక్షేత్రం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయం చేరుకుని ఉమా కుక్కుటేశ్వర స్వామి, పురుహూతిక అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ ఏడాది కార్తికమాసంలో పిఠాపురం పరిసర ప్రాంతాల నుంచే కాక, సుదూర ప్రాంతాల వారు సైతం ఆలయాన్ని దర్శించుకుంటున్నారు. స్థానిక పురుహూతిక అమ్మవారి ఆలయానికి మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై, కుంకుమ పూజలు చేశారు. పట్టణంలో సోమేశ్వరస్వామి, సకలేశ్వరస్వామి తదితర ఆలయాల్లోను జరిగిన ప్రత్యేక పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పిఠాపురం మండలం భోగాపురం, పి.దొంతమూరు, చిత్రాడ, విరవాడ, మల్లాం, రాయవరం, గొల్లప్రోలు మండలం దుర్గాడ రామలింగేశ్వర స్వామి, తాటిపర్తి అపర్ణాదేవి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు.

శివోహం

సామర్లకోట: కార్తికమాసం మూడో సోమవారం శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక పంచా రామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయం కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా గోపూజ నిర్వహించారు. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ పండితులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. ఆలయంలో భక్తులు లక్షపత్రి పూజలు చేశారు. ఆలయ ధ్వజస్తంభం, మారేడు, జమ్మి, ఉసిరి, తులసి చెట్ల వద్ద పూజలు చేసి, దీపాలు వెలిగించారు. సీఐ డి.సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, చల్లా కుమారి, కర్రి వెంకటలక్ష్మి, భక్త సంఘం సభ్యులు చల్లా సత్తిబాబు, బీవీ రమణ, కౌన్సిలర్ ఎస్.సురేష్ భక్తులకు సేవలందించారు. పట్టణ పరిధిలో ఐదు తూముల వద్ద ఉన్న అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, జగదీశ్వర స్వామి ఆలయం, పాత సామర్లకోటలోని చంద్రశేఖర స్వామి ఆలయం, మఠంసెంటర్‌లోని చౌడేశ్వర సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలోను భక్తులు స్వామివారిని అమ్మ వార్లను దర్శించుకున్నారు.



పాదగయ పుష్కరిణిలో కార్తిక దీపాలు వదులుతున్న దృశ్యం



కుక్కుటేశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహిస్తున్న పురోహితులు



పాదగయ క్షేత్రంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన శివాలయాలు

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. పట్టణంలోని శివాలయంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.

శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

కొత్తపల్లి: కార్తిక సోమవారం కావడంతో మండలంలోని శివాలయాలు సోమవారం శివనామ స్మరణతో మారుమోగాయి. కొత్తపల్లిలోని బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామి, ఉప్పాడలోని మత్స్యలింగేశ్వర స్వామి, చౌడేశ్వరి సమేత రామలింగేశ్వరస్వామి, భ్రమరాంబ సమేత వీరమల్లేశ్వర స్వామి, గోర్స, యండపల్లి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో ఉమారామలింగేశ్వర స్వామితో పాటు కొత్తపల్లిలోని రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి, ధర్మశాస్తా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు ధ్వజస్తంభం, రావిచెట్టు, తులసి, మామిడి చెట్ల వద్ద దీపాలను వెలిగించి పూజలు చేశారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: పంచారామాల్లో ఒకటైన బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన జ్యోతిర్లింగార్చన భక్తులను ఎంతగానో అలరించింది. ఆలయ దీపారాధన సంఘ సభ్యులు లక్షపత్రి లక్షపత్రి పూజలు చేసి, దీపాలు వెలిగించారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ఏర్పాటు చేసిన ఆకాశ దీపానికి దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూజలు చేసి దీపం వెలిగించారు.

కారణజన్ముడు ఘంటసాల

బోట్‌క్లబ్: తన గానంతో అందరినీ ఓలలాడించిన ఘంటసాల కారణజన్ముడని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి అన్నారు. సోమవారం ఘంటసాల వేంకటేశ్వర రావు 101 జయంతి సందర్భంగా ఘంటసాల సంగీత కళాపీఠం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయ సమీపంలోని ఘంటసాల విగ్రహానికి నివాళులర్పించారు. చలన చిత్ర పరిశ్రమకు ఘంటసాల చేసిన సేవలు మరువలేమన్నారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో గోపూజ చేస్తున్న భక్తులు



పంచారామ క్షేత్రంలో తెల్లవారుజామున తొలి పూజను తిలకించడానికి బారులు తీరిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న పెద్దాపురంలో శివాలయం



ఉప్పాడలో చౌడేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు